# మూర్తిమత్వం (PERSONALITY)

మన ప్రవర్తన, మనస్తత్వం, మాటతీరు, మనోనిబ్బరం మన 'పర్సనాల్టీ'కి అద్దం పడ్తాయి.

**ఏదేనా ఒక సమస్య ఎదురైనపుడు....**

-బెంబేలు పడి. బావురుమని ఏడ్చేసి... నీరుగారిపోయి... చుట్టూ ఉన్న పది మందినీ హైరానపెట్టి... చతికిల పడిపోయే వ్యక్తి : **'అర్భకుడు'** (Weak Personality)

- అసలా సమస్యే తనది కాదన్నట్టు... ఎలాంటి ప్రతిచర్యా లేకుండా నిస్తేజంగా... నిమ్మకి నీరెత్తినట్టుగా ఉండే వ్యక్తి: **'జడుడు'** (Lethargic Personality)

-సమస్యల చిక్కుముడిని విప్పేందుకు తన శక్తి చాలకపోయినా... ఏవేవో కుయుక్తుల్తో... ఆత్మాభిమానానికి తిలోదకాలిచ్చి... అవసరమైతే పదిమంది కాళ్ళూ గడ్డాలూ పట్టుకునైనా సరే... ప్రతికూల పరిస్థితుల్ని సైతం తనకి అనుకూలంగా మలచుకునే వ్యక్తి : **'లౌక్యుడు'** (Diplomatic personality)

సమస్యతాలూకు స్వరూప స్వభావాల్నీ, లోతుపాతుల్నీ క్షుణ్ణంగా తెలుసుకొని ఏ కష్టానికీ జంకక... ఎవరి సహాయం ఆశించక... సాహస దుస్సాహసాలకి తేడా గ్రహించి... జయాపజయాలకి అతీతుడై.... లక్ష్యసాధనే 'లక్ష్యం'గా.... ఓ చైతన్యాస్త్రంలా దూసుకుపోయే వ్యక్తి:**'సాహసవంతుడు'**(Dynamic Personality)

అర్భకులు సమాజాన్ని ఈసురోమనిపిస్తే- జడులు సమాజాన్ని 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టు చేస్తారు !

లౌక్యులు అవసరార్థం... నిర్లజ్జగా... తమ చిటికెన వేళ్ళమీద సమాజాన్ని ఆడించాలని చూస్తే - సాహసవంతులు సమాజానికి తను చిటికెన వేలినందించి,.. తమతో పాటు వడివడిగా ముందుకు నడిపించాలనుకుంటారు!

లౌక్యం తెలిసిన మనుషులు తమ హోదానీ, అధికారాన్నీ, తమకున్న పరిచయాల్నీ సైతం కేవలం తమ 'వ్యక్తిగత లబ్ధి' కోసం మాత్రమే ఉపయోగించుకుంటే....

సాహసవంతులు - తమ శక్తియుక్తుల్ని పదిమందికీ పనికొచ్చే పనులకోసం ధారపోస్తూ.... అవసరమైతే అర్భకుల భుజం తట్టి - జడుల జడత్వం - లౌక్యుల స్వార్థాన్ని కరిగించి - సమాజాభివృద్ధికి దోహదం కల్గించే పనులు చేస్తారు !

ఎక్కడ చూసినా సాహసవంతులే కన్పించే దేశం... సాటిదేశాల మధ్య ధృవతారలా తళుక్కుమంటుంది !

16-5-1995